

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

8

**ఆ రాత్రి** వెంకటేశ్వరరావు, లక్ష్మి కారులో డిన్నర్‌కు బయటకు వెళ్ళారు. పావనికి, రవికి తెలుసు. తమ తల్లిదండ్రులు వాణి విషయం చర్చించుకోడానికి ఏకాంతం కోసం బయటకు వెళ్ళారని.

'నమస్తే' రెస్టారెంట్ ఆవరణలో వాళ్ళ కారాగింది. ఆ ఇండియన్ రెస్టారెంట్‌లోకి దారి తీశారిద్దరూ, పేరుకి ఇండియన్ రెస్టారెంట్ అయినా దాన్ని నడిపేది పాకిస్తానీయులు. నార్త్ ఇండియన్ ఫుడ్ అక్కడ సర్వ్ చేస్తారు. అమెరికన్ రెస్టారెంట్‌లో భోజనం కన్నా ఆ భోజనం ఖరీదయింది. పది డాలర్లు.

క్రాబ్స్ సూప్, తండూరి రోటి, బైంగన్ కా బర్తా, చికెన్ కర్రీ ఆర్డరు చేశాడు వెంకటేశ్వరరావు. లక్ష్మికి కోకోకోలా, తనకి బడ్‌వైజర్ బీర్ ఆర్డర్ చేశాడు.

"వాణి గురించి నేను మొదటి నుంచీ భయపడుతూనే వున్నాను" చెప్పింది లక్ష్మి. వెజిటబుల్ సలాడ్ ప్లేట్‌లోని కేరట్ ముక్కని పోర్క్‌తో అందుకుని తింటూ.

"దాని వయసెంత? ఇవాళ దాని వయసుకి మించి మాట్లాడింది" ఎర్రబడ్డ మొహంతో చెప్పాడు వెంకటేశ్వరరావు.

"పావని అమాయకురాలు కాని. వాణి అలాకాదు."

"ఇక దాన్ని మ్యూజిక్ క్లాసెస్ మానిపించేయ్ ఆ స్టేన్లీగాడితో అక్కడేగా పరిచయం అయింది."

"నేనూ అదే అనుకున్నాను. కాని అందువల్ల సమస్య పరిష్కారం కాదు. చివరికి యర్రమిల్లి వాళ్ళమ్మాయి చేసినట్లు చేసేలా వుంది. తెల్లవాడు సంవత్సరం తిరక్కుండానే యర్రమిల్లి రాధకి విడాకులిచ్చేశాడు. దీని గతీ అంతే అవుతుంది"

"మొక్కై వంగనిది మ్రానై వంగదన్నారు. దీన్ని ఇప్పుడే వంచకపోతే జ్యోత్స్నలా అవుతుంది. ఇక అది మన మాట వినే దశ దాటింది. నన్నడిగితే మంతెనాయన చేసినట్లు చేయాల్సిందే" భర్తకి సలహా ఇచ్చింది లక్ష్మి.

మంతెన శ్రీరామ్ తన కూతుర్ని పదహారో యేట కరీంనగర్లోని అన్నయ్య ఇంటికి క్రితం నెలే పంపించేశాడు.

ఆమె గురించి అప్పటికే చాలామంది తెలుగువాళ్ళు చెవులు కొరుక్కోసాగారు.

"కాని అది మనల్ని విడిచి అక్కడుండగలదా?"

"ఎందుకు వుండలేదు? మీరు వుండలేరు కాని?" కసిరింది లక్ష్మి.

వెంకటేశ్వరరావుకి తన ముగ్గురు పిల్లల్లోకి వాణి అంటే ప్రత్యేకమైన ఇష్టమని లక్ష్మికి తెలుసు.

"అది మంతెనగారమ్మాయిలా అయితే చూస్తూ అసలు ఊరుకోలేదు. అంతకంటే ఇండియాలో ఉండటమే మంచిది"

"దరిద్రపు దేశం, దరిద్రపు ప్రజలు" అమెరికాని తిట్టింది లక్ష్మి.

ఆమెకీ తన కూతుర్ని తమ కుటుంబానికి దూరంగా పంపడం ఇష్టంలేదు. కానీ తప్పదని అర్థమయింది.

నిజానికి వాళ్ళిద్దరూ మనసులో అప్పటికే సగం నిర్ణయం తీసుకున్నారు - వాణిని అమెరికానుంచి ఇండియాకి పంపడమే సరయిన పరిష్కారం అని.

"ఆ సుహాసినీ చౌదరి నోరూరుకోదు. అందరికీ ఈపాటికి లాంగ్ డిస్టెన్స్ ఫోన్‌లు కూడా చేసి చెప్పేసి వుంటుంది"

"అవును, మనం దీన్ని ఇండియా పంపిస్తే నమ్మని వాళ్ళకు కూడా అది రూఢి అయిపోతుంది. ఇక ఇక్కడ తెలుగువాళ్ళు దీన్ని చేసుకోవడానికి జంకుతారు" వెంకటేశ్వరరావు అసహనంగా చెప్పాడు.

"ఇండియాలో లెక్కలేనంతమంది కుర్రాళ్ళు, ఇమిగ్రేషన్ దొరుకుతుందని ఎగిరి గంతేసి చేసుకుంటారు ఎవరయినా, గ్రీన్ కార్డే వరకట్నం"

ఇండియానుంచి అమెరికాకి వలస వెళ్ళాలనుకునే కుర్రాళ్ళు ఆమెరికాలోని గ్రీన్ కార్డు హోల్డర్‌ని చేసుకుంటే, వారికి గ్రీన్ కార్డు ఆమె భార్యగా లభించే సౌకర్యం ఉంది కాబట్టి అమెరికాలోని తెలుగమ్మాయిలు అనాకారులు అయినా డిమాండ్ ఎక్కువ.

"దాని పెళ్ళి గురించి అప్పుడే ఆలోచించడం అనవసరం కాని. ఆంధ్రాలో ఎక్కడుంచుదాం దీన్ని?" అడిగాడు వెంకటేశ్వరరావు.

"మా ఇంట్లో" చెప్పింది లక్ష్మి.

"మీ అమ్మ దగ్గరా వద్దు. ఆవిడ్ని తలాయించిపారేస్తుంది ఇది. మా నాన్న దగ్గర వుంచుదాం."

"కాకినాడ బెటరా, లేక ఆ శుద్ధ పల్లెటూరు బెటరా?" అడిగింది లక్ష్మి కోపంగా.

"మా నాన్న దగ్గర మూడు నాలుగేళ్ళుంటే మంచీ, చెడ్డా నేర్చుకుంటుంది. మీ అమ్మ నీకన్నా పెద్ద అయోమయం. పైగా మీ తమ్ముడు మీ యింట్లోనే వుంటాడు"

"మా తమ్ముడుంటే ఏం?" కయ్యిమంది.

"వరసైనవాడూ, ఇదీ ఒకే ఇంట్లో ఉండడం నాకు ఇష్టంలేదు" చెప్పాడు వెంకటేశ్వరరావు నిష్కర్షగా.

"ఏడ్చినట్లుంది ఇదా మీకు మావాళ్ళమీద ఉన్న అభిప్రాయం?" కస్సుమంది లక్ష్మి.

"కాకినాడ అవుటాఫ్ క్వశ్చన్. మా నాన్నగారితో రాత్రికి మాట్లాడ్తాను"

"కాని అది ఆ పల్లెటూళ్ళో ఎలా వుండగలదండీ? మీరూ, నేనే ఉండలేమే. అమెరికాలో పుట్టి పెరిగిన పిల్ల.."

"తప్పదు. అమెరికా వచ్చిన మొదటి మూడేళ్ళూ నీకెలా ఉంది? ఇక్కడ నచ్చక ఇండియా తిరిగి వెళ్ళిపోదామని గొడవ పెట్టేదానివిగా ఇపుడు ఇండియా వెళ్ళాలంటే నీకిష్టంలేదు. కొద్దికాలం పడుతుంది ఎవరికయినా అడ్జస్ట్ అవడానికి షి విల్ బి సేఫ్ దేర్!"

"మీ కూతురు, మీ యిష్టం" చెప్పింది లక్ష్మి అదే కోపంతో.

"సో! వాణిని ఇండియా పంపించేయడం నిశ్చయమైనట్లేనా?" "నాన్యః పంథా"

"వన్‌మోర్ బీర్ ప్లీజ్!" చెప్పాడు వెంకటేశ్వరరావు అమెరికన్ వెయిటర్‌తో.

మర్నాడు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ దగ్గర వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులంతా కలిశారు.

వాణి ముభావంగా కూర్చుంది. వెంకటేశ్వరరావు చెప్పాడు వాణితో.

"నిన్న మీ అమ్మా, నేనూ నీ విషయంలో ఓ నిర్ణయం తీసుకున్నాం."

వాణి ఏమిటని అడగలేదు. కనీసం ప్రశ్నార్థకంగా కూడా చూడలేదు.

బ్రెడ్‌కి జామ్ రాసుకుని తినసాగింది.

"నిన్ను మీ తాతయ్య దగ్గరికి పంపిస్తున్నాం"

"నేను వెళ్ళను" తక్షణం సమాధానం చెప్పింది వాణి.

ఆమెనుంచి అలాంటి రియాక్షన్ ఎదురుచూశారంతా.

"నాన్నగారి మాటకే ఎదురు చెపుతావా?" అరిచింది లక్ష్మి.

"డాడీ ఓ పనిచేద్దాం అయితే?" చెప్పింది వాణి రోషంగా తండ్రివంక చూస్తూ.

"ఏమిటి?"

"మీకు ఇండియా అంటే ఇష్టంకదా?"

"అవును"

"మీరు ఇన్నేళ్ళుగా సంపాదించింది మొత్తం రుపీస్‌లోకి మార్చుకుంటే కనీసం మూడుకోట్ల రూపాయిలయినా అవుతాయి కదా?"

"ఏమిటి నువ్వు మాట్లాడేది?" అప్పటికే వెంకటేశ్వరరావు భృకుటి ముడిపడింది.

"చెప్పండి, అవుతుందా లేదా?"

తరచు వెంకటేశ్వరరావు, లక్ష్మి డాలర్స్‌లో తాము పొదుపుచేసింది రూపాయల్లోకి మారిస్తే ఎమవుతుందో చెప్పుకుని, ఇండియాలో వుంటే అంత సంపాదించడం అసాధ్యమై వుండేది అనుకుని మురిసిపోతుంటారు.

"మూడున్నర కోట్ల రూపాయలపైనే. అయితే ఏమిటి?"

"అది మన ఫామిలీ ఇండియాలో హాయిగా బ్రతడానికి సరిపోతుంది. అలాంటప్పుడు మీరింకా ఇక్కడే ఎందుకున్నారు? మీరు అమెరికాకి వచ్చింది సంపాదనకి, అనేకసార్లు మీ ఫ్రెండ్స్‌తో చెప్పారు.

అమెరికాలో సెటిల్ అయ్యేది లేదని, ఇండియా వెళ్ళిపోతామని మీరు ఇక్కడనుంచి తీసుకెళ్ళే ఆ డబ్బుమీద వచ్చే రాబడిమీద అయిదేళ్ళదాకా ఇండియాలో ఇన్‌కమ్‌టాక్స్ కూడా కట్టక్కరలేదు. నాన్‌రెసిడెంట్ ఇండియన్ కాబట్టి, మీరు వచ్చి పద్దెనిమిదేళ్ళు దాటుతోంది. అమెరికాకు వచ్చిన పని అయిపోయింది. సంపాదించాల్సినదంతా సంపాదించేశారు. మన ఫామిలీని ఇండియాకు షిఫ్ట్ చేయండి"

"ఇక్కడ పనిచేసిన ఏ డాక్టరూ ఇండియాలో పనిచేయలేడు"

"మీరు పని చేయక్కరలేదు. మీ రిటైర్‌మెంట్ లైఫ్‌ని అక్కడ శ్రీనగర్ కాలనీలోని మన ఇంట్లో ఎంజాయ్ చేయండి"

"నో! నీకోసం నేను ఫామిలీని మొత్తం షిఫ్టు చేయలేను" చెప్పాడు వెంకటేశ్వరరావు.

"నాకోసం కాదు, మీరు ప్రేమించే ఇండియా కోసం నే చెప్పేది. మీరే అంటారుగా జననీ జన్మభూమిశ్చ అని. పద్దెనిమిదేళ్ళు దూరంగా వున్నారు. ఇక ఉండాల్సిన అవసరం లేనప్పుడు ఎందుకుండాలి? అమెరికాలో, టాయ్‌లెట్ రోల్స్ ఉపయోగించే తెల్లవాళ్ళ మధ్య ఎందుకుండటము? మీకు నచ్చే సంప్రదాయాలున్న మన ఇండియాకి వెళ్ళిపోదాం. నేనక్కడ మీరు కోరినట్లుగా ఎవరితోనూ డేటింగ్ చేయను. మన సంప్రదాయం ప్రకారం పూలజడ వేసుకుని చాపమీద తలవంచుకుని పెళ్ళిచూపులకి అమ్మ మీ ముందు కూర్చున్నట్లు కూర్చుని మీరు చెప్పినతన్ని వివాహం చేసుకుంటాను నేనే కాదు, పావనక్క కూడా!"

"నాకింకా ఇంటిమీద మార్ట్‌గేజ్ ఉంది. "

"తీర్చే వెళదాం."

"నో. నువ్వు ఒంటరిగా వెళుతున్నావు. దటీజ్ ఫైనల్" చెప్పాడు వెంకటేశ్వరరావు లేచి నిలబడి.

"యు ఆర్ ఏ హిపోక్రయిట్ డాడీ"

"వాణీ! నీనోరు పెద్దదవుతోంది" హెచ్చరించింది లక్ష్మి.

"ఏం? నువ్వెందుకు డాడీకి చెప్పవమ్మా ఇండియా వెళదామని. నువ్వే అంటావుగా అమెరికాలో అన్నీ ఉన్నాయి కాని ఇండియాలో దొరికే మజా ఇక్కడ దొరకదని, ఓ ఇల్లు కొన్నా, ఓ నగ చేయించుకున్నా, కొత్తకారుకొన్నా, పట్టుచీరలు కొన్నా ఇక్కడ చూపించుకోడానికి ఆంధ్రాలోలాగా పొరుగు, పేరంటానికి పిలవడానికి ఇరుగులేరంటావుగా? వాయనం ఇచ్చుకోడానికి ముత్తయిదువులు కరువంటావు కదా! మనం వచ్చింది డబ్బుకోసం. ఆ పని పూర్తయింది. ఇంకా ఎందుకు అమెరికా పట్టుకుని వేలాడటం?"

"కాదు."

"ఎందుకు కాదంటే నీవు హిపోక్రయిట్‌వి. నీకు అమెరికా కావాలి. అమెరికన్ డాలర్స్ కావాలి. అమెరికాలో లభించే సౌకర్యవంతమైన జీవితం కావాలి. ఫోన్ కనెక్షన్ దొరకని, దోమలు ముసిరి ఈగలువాలే, కరెంటు కోత ఉన్న లంచాలిచ్చి గవర్నమెంట్ ఆఫీసుల చుట్టూ తిరిగినా పని జరగని ఇండియా మీకొద్దు. ఇక్కడలా ఎప్పుడు పంపు తిప్పితే అప్పుడు తాగడానికి వచ్చే శుభ్రమైన నీటి సౌకర్యం లేని, గవర్నమెంట్ ఆఫీసు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తే కానీ పనులు కాని బ్లడీ డర్టీ ఇండియా నీకక్కర్లేదు.

"ఎప్పుడయితే నీవు అమెరికాలో అత్యంత సౌకర్యవంతమైన పౌరజీవితానికి అలవాటుపడ్డావో, ఆనాడే నీవు మానసికంగా అమెరికన్ వయ్యావు డాడీ. నీవు ఇండియాకి విడాకులిచ్చేశావు. కమాన్ డాడీ, బి ట్రూత్‌ఫుల్ టు యువర్ సెల్ఫ్ నే చెప్పేదాంట్లో అబద్ధం వుందని గుండెమీద చేయించుకుని చెప్పు. చెప్పలేవు. ఇక నువు ఇండియా తిరిగి వెళ్ళడము కల. నీవు పుట్టిన ఊరి మీద మమకారంతో మూడేళ్ళకోసారి వెళ్ళి చూసొస్తుంటావు. నీ ఫ్రెండ్స్ ముందు, బంధువుల ముందు నీ ఐశ్వర్యం ప్రదర్శించి త్రీస్టార్, ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండి రావడానికే నీకు ఇండియా."

వెంకటేశ్వరరావు మొహం కోపంతో జేవురించింది. "ఐ డోంట్ లైక్ దిస్ కైండ్ ఆఫ్ టాక్" అరిచాడు.

"నీ దగ్గర సమాధానం లేక ఆ కోపం. ఉన్న విషయం చెపుతున్నానని కోపం. నీవు ఎప్పుడయితే ఇండియాకి తిరిగి వెళ్ళక అమెరికాలో ఉండాలని నిశ్చయించుకున్నావో, అప్పుడు నీ పిల్లలు అమెరికన్‌లా ప్రవర్తించడం విషయంలో కూడా నువ్వు రాజీపడాలి, డాడీ. ఇక్కడి హైవేలని, టర్న్ స్పెక్స్‌లోని, నేషనల్ పార్క్‌లో పిక్నిక్స్‌ని, జెలసి. పెన్నీలో దొరికే ఇండియాలో దొరకని వందలకొద్దీ వస్తువులని నట్ డాగ్స్‌ని, మెక్‌డొనాల్డ్‌లోని చికెన్ నగ్గెట్స్‌ని (అది వెంకటేశ్వరరావు ఫేవరెట్ ఫుడ్) ఐస్‌క్రీమ్‌ని, క్లీన్ వాతావరణాన్ని, టైమ్‌సెన్స్‌ని, సిన్సియారిటీ ఆఫ్ వర్క్‌ని, ఫోన్ చేస్తే మూడు నిమిషాల్లో వచ్చే అంబులెన్స్‌ని, పోలీస్ పెట్రోల్ కార్లని నువ్వు లైక్ చేసినట్లే, నువ్వీ దేశంలోని జీవనవిధానాన్ని ప్రేమించాలి, నువ్వు మంచిని, చెడును కలిపి ప్రేమించాలి డాడీ. మనిషినయినా, దేశాన్నయినా."

"యు స్టుపిడ్ ఆఫ్ ఏ గర్ల్" అరిచాడు వెంకటేశ్వరరావు. వాణి చెప్పే వాస్తవాలని ఒప్పుకోలేక, జీర్ణించుకోలేక.

"అయ్యో భగవంతుడా. నన్ను ఈ వలస వచ్చిన వాళ్ళకడుపున ఎందుకు పుట్టించావురా? ఏ నల్లవాళ్ళ కడుపులోనో ఎందుకు పుట్టించలేదురా అని నేను ఏడ్చేలా చేస్తున్నారు మీరిద్దరూ!" వాణి రోషంగా చెప్పింది.

"మూర్ఖురాలా!" అరిచింది లక్ష్మి వాణి చెంపమీద కొట్టి.

"నేనుకాదు. ఎవరో నాకు తెలుసు. హైట్స్ ఆఫ్ హిపోక్రసీగల ఈ మనుష్యుల మధ్య ఉండటం కంటే నాకు తాతయ్య దగ్గరకి వెళ్ళి వుండటమే యిష్టం. ఏర్పాట్లు చేయించండి" చెప్పింది వాణి.

వాణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అది ఎవరూ చూడకుండా ఉండటానికి తన గదిలోకి వెళ్ళిపోయింది. వెళ్ళాక నిశ్శబ్దంగా వెక్కి వెక్కి ఏడవసాగింది. ఆ ప్రపంచంలో తాను ఒంటరిగా ఉన్నట్లుగా ఫీలైంది. తల్లి, తండ్రి, తోడబుట్టినవారు తనకేమి కానివారుగా, తనకెవరూలేనట్లుగా మనసునిండా శూన్యం నిండిన భావన.

నిశ్శబ్ధంగా వాణి చెప్పేది మొత్తం విన్నది జూడీ. తనను తాతయ్య చూడాలనుకుంటున్నారని. అందుకని ఇండియా వెళ్ళి మూడు నాలుగేళ్ళు ఉండి వస్తానని అబద్ధం చెప్పింది. తన కుటుంబ విషయాలు బయట పడేయలేదు.

"అంటే వెళ్తున్నావన్నమాట" చెప్పింది జూడీ బాధగా.

"నాన్యఃపంథా" చెప్పింది వాణి దిగులుగా నవ్వి.

"అంటే?"

"నోవే! సంస్కృతంలో మాట అది. మా అమ్మ తరచు అంటూంటుందది."

"మనిషంటూ ఉన్నంతకాలం 'నోవే' అన్ని భాషల్లో ఉంటుంది" చెప్పింది జూడీ తల్లి.

"నువ్వు వెళ్ళేలోగా మా ఇంటికి డిన్నర్‌కి రా." ఆహ్వానించాడు జూడీ తండ్రి థామ్సన్.

"థాంక్స్ అలాగే వస్తాను."

"బాధపడకు. మూడు నాలుగేళ్ళు ఎంతకాలం? ఇట్టే తిరిగివస్తుంది. మీ తాతయ్యని హేపీగా ఉంచాల్సిన బాధ్యత నీమీద వుంది" చెప్పింది జూడీ తల్లి.

"బాధలేదు మిసెస్ థామ్సన్. అందరికీ ఒకటే స్వంతదేశం వుంటుంది. రెండు దేశాలు స్వంత దేశాలున్నదాన్ని నేనొక్కదాన్నే. ఒకటి అమెరికా, యింకొకటి ఇండియా" చిన్నగా నవ్వింది వాణి.

వాణి టీవీలో వచ్చే చదరంగం ఆటను చూస్తూ, తనూ చెస్ బోర్డులోని పావులని కదుపుతోంది. తను కదిలించింది రాసుకుని, టీవీలోని ప్రత్యర్థి కదిపినట్లుగా మళ్ళీ కాయిన్స్‌ని అడ్జస్ట్ చేసుకుంటోంది. అతనిది తనకన్నా బెటర్ మూవ్ అని చాలాసార్లు గ్రహించింది. అలా నలభై నిమిషాలుగా ఆడుతోంది చెస్‌ని.

ఫోన్ మోగింది. రిసీవర్‌ని విసుగ్గా అందుకుని చెప్పింది.

"హలో!"

"హాయ్. స్టేన్లీ హియర్."

వాణి వెంటనే చెప్పింది. "హాయ్ స్టేన్లీ. వాణి స్పీకింగ్."

"నిన్న మ్యూజిక్ క్లాస్‌కి రాలేదే? ఆర్ యు ఆల్‌రైట్?"

"ఐయామ్ ఫైన్. మా పేరెంట్స్ నిన్నటినించి నా మ్యూజిక్ క్లాస్ మాన్పించేశారు."

"ఎందుకని?" స్టేన్లీ కంఠంలో ఆశ్చర్యం తొంగిచూసింది.

కొద్ది క్షణాలు ఆలోచించింది వాణి. తనను డేటింగ్‌కి పిలిచిన కృతజ్ఞతతో నిజం చెప్పాలనిపించింది.

"మన డేటింగ్ మావాళ్ళకి నచ్చలేదు. నన్ను ఇండియా పంపించేస్తున్నారు."

"గుడ్ హెవెన్స్ ఎప్పుడు?"

"ఇంకో వారంలో"

"మళ్ళీ ఎప్పుడు వస్తావు?" ఆదుర్దాగా అడిగాడు.

"మూడు నాలుగేళ్ళదాకా రాకపోవచ్చు"

"ఐ విల్ మిస్ యూ వాణీ!" బాధగా చెప్పాడు స్టేన్లీ.

"సో విల్ ఐ స్టేన్లీ."

"నా వల్ల నీవు వెళ్ళడం నాకు బాధగా ఉంది. ఐ యాం సో సారీ. వెళ్ళేలోగా నిన్నోసారి చూడాలి వాణీ"

"రేపు?" అడిగింది.

"నో. ఐ యామ్ ఆ ఫ్రైడ్ ఇట్ వోంట్ బి పాజిబుల్ టుమారో. పి.సి మీద చాలా పని పేరుకుపోయింది. రేపు క్లియర్ చేస్తానని మా (అమ్మ)కి ప్రామిస్ చేశాను. ఎల్లుండి సాయంత్రం?"

"ఓకే. ఐ విల్ కాల్ యు. ప్లీజ్ డోంట్ కాల్ మి"

"ఓకే. పేరడైజ్ డిస్కోలో కలుద్దాం. టైం చెప్పు చాలు"

అతను ఫోనులో ముద్దు పెట్టిన చప్పుడు.

"బై!"

తనూ అలా శబ్దం చేసి రిసీవర్ పెట్టేసింది వాణి. తన తల్లి తండ్రులకు తెలీకుండా స్టేన్లీని కలవడం, వాళ్ళకి తన అభీష్టానికి వ్యతిరేకంగా ఇండియా పంపించడానికి బదులుగా తను కసి తీర్చుకోవడం అనుకుంది వాణి.

ఆ రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ దగ్గర కార్డ్‌లెస్ ఫోనులో కుటుంబ సభ్యులంతా వినేలా మాట్లాడాడు వెంకటేశ్వరరావు. అతను వాణితో మాట్లాడటం మానేశాడు. స్వభావరీత్యా వాణి నిర్మొహమాటంగా తన మనసులోని మాటలు చెప్పిన వాటికి అతను బాగా దెబ్బతిన్నాడు.

"హలో మిస్టర్ కృశ్చేవ్?" అడిగాడు.

అతని పేరు చలసాని కృశ్చేవ్. వాళ్ళ తల్లిదండ్రులు కమ్యూనిస్టులు. దాంతో కమ్యూనిస్టు అధినేత అయిన కృశ్చేవు పేరు పెట్టారు. ఆ పేరువల్ల అతనికి ఇండియాలో రెండుసార్లు వీసా రిజెక్ట్ అయింది. తను కమ్యూనిస్ట్ కాదని, పిల్లలు పుట్టి మరణిస్తుంటే హిందూవేతర పేరుని ఆచారం ప్రకారం బ్రతికితే పిల్లలకి పెడతారని, ఆ ప్రకారం తను కృశ్చేవు ప్రీమియర్ అయిన రోజు పుట్టడంతో ఆ పేరు పెట్టారని తన తల్లిదండ్రులుకూడా కమ్యూనిస్టు కాదని, మార్చుకోమంటే తన పేరుని జాన్ కెన్నడీగా మార్చుకుంటానని మూడోసారి తనను ఇంటర్వ్యూ చేసిన కాన్సులేట్ ఆఫీసర్‌తో చెప్పాడు కృశ్చేవు. కమ్యూనిస్టులమీద జోక్ కూడా వేశాడు. ఏరోఫ్లోట్ పైలట్ కుక్క మాస్కో నించి న్యూయార్క్ విమానంలో వారానికోసారి వచ్చి తనివితీరా మొరిగి మాస్కోకి వెళుతుంటుందని. అతనికి వీసా ఇచ్చింది. ఆ జోక్‌కు నవ్విన కాన్సులేట్ ఆఫీసర్, అమెరికాలో ఆ పేరు కృశ్చేవుని ఇబ్బందికి గురిచేస్తూనే ఉంది అతను ట్రావెల్ ఏజెన్సీని నడుపుతున్నాడు.

"నమస్తే. వెంకటేశ్వరరావుని. ఏం లేదు. మా అమ్మాయి వాణి ఇండియా వెళుతుంది. వన్ డే మీరు ఏర్పాట్లు చేసి పెడతారని ఫోన్ చేశాను. వెల్ ఎనీ డే ఆఫ్టర్ వెడ్నెస్‌డే ఎయిర్ ఇండియా వద్దు. సర్వీసు బావుండదు. డెల్టా ఆర్ బ్రిటిష్ ఎయిర్వేస్. ఓ లుఫ్తాన్సా సూట్స్ ఫైన్. యస్ వన్ వే.. వాణి... ఫోర్టీన్. బాంబే ఆర్ ఢిల్లీ. కనెక్టింగ్ ఫ్లైట్ టు హైదరాబాద్.. హైదరాబాద్ టు రాజమండ్రి. ఇప్పుడు వాయుదూత్ లేదా? నాకు తెలీదు. థర్స్‌డే సూట్స్ ఫైన్ కన్‌ఫర్మ్‌డ్ టికెట్ తీసుకోండి. బిల్ రాగానే మీకు చెక్ పంపిస్తాను. అవును, ఒక్కత్తే వెళుతోంది. ఏం లేదు. మా నాన్నగారు బాగా బెంగపడ్డారు చూడాలనీ ఉందంటున్నారు. అందుకని. అదింకా అనుకోలేదు కానీ ఓ ఏడాది అక్కడే ఉంచి చదివిస్తానంటున్నారు. తీసుకెళుతుంది. ఓ కిలో బరువు మించకుండా పంపండి. ఓ ష్యూర్ అక్కడ లోకల్‌గా మెయిల్ చేస్తుంది. ఏమిటి కె.వి నాయుడుగారు వెస్ట్‌కి మూవ్ అవుతున్నారా? నాకింకా తెలీదు. క్వాంటమ్‌లోనా? మంచి కంపెనీ. ఎలా వుంది మీ వ్యాపారం? గుడ్ ఇంకేమిటి విశేషాలు? అవును. సెయింట్ లూయిస్ టు న్యూయార్క్ టు బాంబే టు హైదరాబాద్. ఓకే థాంక్స్ సీ యూ.."

లైన్ కట్ చేసి చెప్పాడు లక్ష్మితో.

"విన్నావుగా థర్స్‌డే లుఫ్తాన్సాలో సీట్ ఉందట. ఇక్కడ నుండి డెల్టాలో న్యూయార్క్ దాకా అక్కడనించి లుఫ్తాన్సా వయా ఫ్రాంక్‌ఫర్ట్."

వాణి ముఖం ఎర్రబడింది. తను వెళ్ళడం ఖాయం అని తెలియగానే.

"డర్టీ బాస్టర్డ్" చెప్పాడు వెంకటేశ్వరరావు కోపంగా. ఆయనకి బాధగా ఉంది వాణిని పంపించడం.

అది ఎవర్ని ఉద్దేశించి అన్నాడో వాణికి తెలుసు. అయితే ఆమె స్టేన్లీతో ప్రేమలో పడలేదు. తోటి అమెరికన్ ఆడపిల్లల్లా డేటింగ్ ప్రాసెస్ లో ఉందంతే. అందుచేత పెద్దగా బాధపడలేదు.

"ఈ అమెరికన్స్ ఇండియన్స్ ఆర్ డర్టీ అంటారు. మనవాళ్ళలా కనీసం నీళ్ళయినా ఉపయోగించరు. టిష్యూ పేపర్‌తో ఏం క్లీన్ అవుతుంది? అలాంటి వాడితో కాపురం ఛ...ఛీ!"

వెంకటేశ్వరరావు ఈ విషయం ఎన్నో వందలసార్లు పిల్లలకి చెప్పాడు. అందువల్ల వాళ్ళకు అమెరికన్స్ అంటే విరక్తి, అసహ్యం కలుగుతాయని ఆయన ఉద్దేశ్యం. కానీ మొదటిసారిగా అలాంటివాడితో కాపురం.. ఛఛ అన్న మాటలు ఉపయోగించారు.

వాణి రియాక్ట్ అయి చెప్పింది. "స్టేన్లీ లక్షలమంది అమెరికన్స్‌లా ప్రతిరోజూ బాత్‌టబ్‌లో స్నానం చేస్తాడు. టిష్యూపేపర్ ఉపయోగించాక మనమెంత శుభ్రంగా వున్నామో వాళ్ళూ అంతే శుభ్రంగా వుంటారు."

"వాణీ ఊరుకో" చెప్పింది ఆమె అక్క పావని.

"పాపాలుచేసి, ఆ తరువాత ఎంచక్కా దేవుడూ మన్నించు అంటే చాలు వీళ్ళకి. పాప ప్రక్షాళన జరుగుతుంది" చెప్పాడు వెంకటేశ్వరరావు.

"ఇక్కడ తెల్లవాళ్ళు నీగ్రోలని, నీగ్రోలు తెల్లవాళ్ళని అసహ్యించుకుంటారు. అది చర్మం రంగునుబట్టి కావచ్చు, లేదా నీగ్రోల బద్ధకం, నేర మనస్తత్వం వల్ల కావచ్చు. కానీ ఒకేరంగు చర్మంగల మనం డేడీ? చూడటానికి కనబడని, చెపితేకాని తెలీని కులాన్ని బట్టి ఒకర్నొకరం ద్వేషించుకుంటున్నాం. అది తప్పుకాదా?" అడిగింది వాణి.

వెంకటేశ్వరరావు మాటలకి తడుముకుంటుంటే చెప్పింది వాణి.. "కొన్ని కులాలవాళ్ళను స్నేహితులుగా అనుకుంటున్నాం. కొన్ని కులాల వాళ్ళని శత్రువులుగా భావించి ద్వేషిస్తున్నాం. యూదువులను కేవలం వాళ్ళ మతాన్ని బట్టి ద్వేషించి చంపించిన హిట్లర్‌కి, ఓ కులం వాళ్ళని ఇంకొక కులం వాళ్ళే ద్వేషించే మన హిందూ మతస్థులకి తేడా ఏమిటి? నన్నడిగితే హిట్లర్ చచ్చాడు. మనం బ్రతికి వున్నాం. అంతే తేడా. క్రిష్టియన్స్ విశ్వ ప్రేమికులు. ప్రపంచంలో క్రిష్టియన్ మిషనరీస్ చూస్తే చాలు తెలుస్తుంది. పైగా క్రిష్టియన్స్‌కి పెళ్ళి, ప్రేమ విషయాల్లో మతం, కులం ప్రామాణికం ప్రతిబంధకం కాదు. మనకో మతం, కులం, శాఖ, గోత్రం ఇన్ని చూడాలి. అనేకమంది శత్రువులు కలిస్తే హిందూమతం డేడీ. అదే అనేకమంది సోదరులు కలిస్తే క్రిష్టియన్ మతం. సేవ్ యువర్ బ్రెత్. యూ కాంట్ ఆర్గ్యూ విత్ మీ.

నేను ఇండియాలో ఉన్నా, ఇక్కడ ఉన్నా నా ఇండివిడ్యువాలిటీని ఎవరూ కిల్ చేయలేరు" ఆవేశంగా చెప్పింది వాణి.

వెంకటేశ్వరరావు వెంటనే కాఫీ కప్పు తీసుకుని లేచి పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

"వెళ్ళబోయేముందు ఎందుకిదంతా?" అడిగింది చెల్లెల్ని కోపంగా.

బదులుగా వాణి తన కుడిచేతిని వీపు వెనక వుంచి మధ్యవేలుని హుక్‌లా చేసింది.

Post your comments

అదో గొప్ప తిట్టు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)* **ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**